

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులు

లారీల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసే తమ లారీలు నిలిపేందుకు ప్రభుత్వ పరంగా స్థలం కేటాయించేలా చూడాలని హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోషామహల్ ప్రాంతం కేంద్రంగా గతంలో తాము ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసేవారమని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా కొన్నాళ్ల కిందట ఆటోనగర్ ప్రాంతంలో తాము వ్యాపారం చేస్తున్నామన్నారు. లారీలు నిలిపేందుకు ఆటోనగర్‌లో కూడా ఇబ్బందికర పరిస్థితుల నేపథ్యంలో తామంతా రామోజీ ఫిల్మ్ సిటీ అవతల లారీలను నిలిపి.. వ్యాపారం చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ట్రాన్స్‌పోర్ట్ లారీల పార్కింగ్ కోసం ప్రభుత్వపరంగా స్థలం కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్థలం కేటాయించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కోశాధికారి శంకర్, శేషు, యాసిన్, జగదీశ్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు

ఆర్టీసీ కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు

- కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాలనీ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆర్టీసీ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కాలనీలో మూడు అంతర్గత దారుల్లో సీసీ రోడ్లు వేయాలని, తాగునీటి పైప్‌లైన్లను మిగతా ఇళ్లకూ ఉపయోగపడేలా పొడిగించాలని కాలనీ ప్రతినిధులు ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ పైప్‌లైన్ పనుల్లో నాణ్యత పాటించాలని, పనుల్లో ధ్వంసమైన పైప్‌లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తాగునీరు వంద మీటర్ల వరకు పొడిగించాలని జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డిని కోరారు. కాలనీ కమ్యూనిటీహాల్ రెండో అంతస్తులో సీనియర్ సిటిజన్ల కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, కాలనీ ప్రతినిధులు తీగుళ్ల యాదగిరి, పెంటారెడ్డి, లక్ష్మయ్యగౌడ్, శివచారి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

- మేయర్ చిగురింత పారిజాతానర్సింహారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో గతంలో శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు మేయర్ చిగురింత పారిజాతానర్సింహారెడ్డి చెప్పారు. 20వ డివిజన్‌లోని బడంగ్‌పేట్ ఓల్డ్ విలేజ్‌లో జరుగుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను మంగళవారం కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిధుల లభ్యతనుబట్టి ప్రజల అభీష్టానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో సురక్ష సేవా సంఘం, తెలంగాణ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురక్షసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపిశంకర్‌యాద్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. బీపీ, షుగర్, రక్త, థైరాయిడ్, కిడ్నీ, లివర్‌తో పాటు 16 రకాల పరీక్షలను ఉచితంగా చేశారు. అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. సుమారు 500 మంది కాలనీవాసులు పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిహాల్, తౌఫిక్ అహ్మద్, క్యాంప్ కో-ఆర్డినేటర్ వంశీ, నాగవల్లి, యాదగిరి, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీలలో మిగిలిపోయిన పనులపై దృష్టి

కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డి మంగళవారం డివిజన్‌లోని వరదయ్యనగర్ కాలనీ, సాయినగర్ కాలనీ ఫేజ్-2లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో వరదయ్యనగర్ కాలనీలో వరద నీటి పైపులైను పనులను, సాయి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో రెండు కాలనీలలో సమస్యలు చాలావరకు తీరుతాయన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా కాలనీలలో మిగిలిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను కూడా చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, జలమండలి మేనేజర్ రాజు పాల్గొన్నారు.

రైతులకు రూ.3కోట్ల 71లక్షల రుణాలు మంజూరు

- సంఘం చైర్మన్ సత్తయ్య

హయత్‌నగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం మంగళవారం సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నవంబర్ నుంచి జనవరి నెల వరకు అయిన జమాఖర్చులను ఆమోదించారు. కొత్తగా 58 మందికి సంఘం సభ్యత్వం అందించారు. స్వల్పకాలిక, దీర్ఘకాలికానికి చెందిన రూ.3 కోట్ల 71లక్షలను మంజూరు చేస్తు తీర్మానం చేశారు. సంఘానికి బాకీపడిన 62 మందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి, అప్పులు వసూలు చేయడానికి తీర్మానించారు. అదేవిధంగా ఇటీవల మరణించిన బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతు సంరెడ్డి రంగారెడ్డి కుటుంబానికి రూ.25వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, పాలకవర్గం సభ్యులు సంజీవరెడ్డి, లక్ష్మమ్మ, నర్సింగ్‌రావు, స్వప్న, యాదగిరి, శీలం లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, భార్గవి, సంఘ సెక్రెటరి రాందాసుతో పాటు పలువురు పాల్గొన్నారు.



కాలనీవాసులతో కలిసి ఎస్‌బీఐకాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐకాలనీ, కృష్ణానగర్‌లలో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ చెప్పారు. జలమండలి అధికారులతో కలిసి మంగళవారం ఎస్‌బీఐ కాలనీ, కృష్ణానగర్ కాలనీలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలలో డ్రైనేజీ పైప్‌లైన్ సమస్యలపై తరచు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జలమండలి అధికారులతో కలిసి స్వయంగా సమస్యలను పరిశీలించాలని వచ్చినట్లు చెప్పారు. కాలనీవాసులు తమ సమస్యలను వారికి చూపించి వివరించారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్రీవాణి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం బలరాం, డీజీఎం సరిత, ఏఈ ప్రవీణ్, కాలనీ ప్రతినిధి సుదర్శన్, బీజేవైఎం కార్యవర్గసభ్యులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ, ఎవరు వేధించినా ..

నిర్భయంగా ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న విమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్

- రాచకొండ మహిళా రక్షణ విభాగం, షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ హెచ్చరిక
- 15 రోజుల్లో 108 మంది ఆకతాయిలను పట్టుకున్న షీ టీమ్స్

మాయమాటలతో ప్రేమిస్తున్నామంటూ బాలికలకు, యువతులకు ఆకతాయిలు దగ్గరై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఎల్‌బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయం వద్ద షీ టీమ్స్ కార్యాలయంలో మంగళవారం ఆకతాయిలకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలను వేధించే వారెవరైనా సరే కుటుంబ సభ్యులైనా, బయటి వారైనా వారిపై కఠిన చర్యలు తప్పవని రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ హెచ్చరించారు.

కొత్తపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గత నెల 16 నుంచి 31 వరకు 133 ఫిర్యాదులకు స్పందించిన షీ టీమ్స్ 108 మంది ఆకతాయిలను పట్టుకున్నారన్నారు. ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పి.పరశురాం, అడ్మిన్ ఎస్‌ఐ రాజు, కౌన్సెలింగ్ నిపుణులు శాంతిప్రియ, శ్యామలగొరి నిందితులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

ఆకతాయిల్లో 67 మంది మేజర్లు, 41 మంది మైనర్లు

రాచకొండ షీ-టీమ్స్ పట్టుకున్న 108 మంది ఆకతాయిల్లో 67 మంది మేజర్లు, 41 మంది మైనర్లు ఉన్నారు. వాట్సప్ కాల్స్, మెసేజీల ద్వారా మహిళలను వేధించిన ఫిర్యాదులు 18, ఫోన్ల ద్వారా వేధించినవి 29, నేరుగా ఇబ్బంది పెట్టినవి 54, సోషల్ మీడియా యాప్స్ ద్వారా అసహ్యంగా ప్రవర్తించినవి 32 ఉన్నాయి. నిందితులపై 5 క్రిమినల్ కేసులు, 68 పెట్టీ కేసులు, 38 మందికి సాధారణ కౌన్సెలింగ్ కేసులు నమోదయ్యాయి. కొన్ని కేసులను రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్, షీ-టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ వివరించారు. మహిళలకు అవగాహన కల్పిస్తూ ఆకతాయిలను పట్టుకుని మహిళలకు అండగా నిలుస్తున్న షీ-టీమ్స్‌ను రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు.

ప్రేమిస్తున్నామంటూ మాయమాటలతో దగ్గరై..

ప్రేమిస్తున్నానంటూ మాయమాటలతో బాలికకు దగ్గరై అఘాయిత్యానికి ప్పాడి, మార్ఫింగ్ చేసిన ఫోటోలు పంపుతూ వేధిస్తున్న నిందితుడిని ఇబ్రహీంపట్నం షీ-టీమ్స్ పట్టుకుని పీఎస్‌లో అప్పగించారు. నిందితుడిని పోలీసులు కటకటాల్లోకి పంపారు. నేరేడ్‌మెట్‌లో ఉండే యువతిని పెళ్లాడతానంటూ ఆమె క్లాస్‌మెట్ మభ్యపెట్టాడు. ఒంటరిగా ఉన్నప్పుడు అతడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత మరో యువతితో నిశ్చితార్థం చేసుకుని వేధించాడు. కుషాయిగూడ షీ-టీమ్స్ రంగంలోకి దిగి నిందితుడికి జైలు శిక్షపడేలా చేసింది.

అదేవిధంగా స్విమ్మింగ్ కోచ్ బాలికను ప్రేమ పేరుతో స్నాప్‌చాట్‌లో వేధిస్తున్నాడంటూ బాధితురాలి తల్లి మల్కాజిగిరి షీ-టీమ్స్‌ను ఆశ్రయించడంతో వారు మేడిపల్లి పోలీసుల సహకారంతో నిందితుడిని జైలుకు పంపారు. ఎల్‌బీనగర్, వనస్థలిపురం, కుషాయిగూడ, మల్కాజిగిరి ప్రాంతాల్లో షీ-టీమ్స్ డెకాయ్ ఆపరేషన్ చేపట్టి మహిళలను, బాలికలను వేధిస్తున్న 38 మంది మైనర్ ఆకతాయిలను అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తప్పవంటూ కౌన్సెలింగ్ ఇచ్చారు.

షీ టీమ్స్ చొరవతో బాల్య వివాహానికి బ్రేక్

భువనగిరిలో షీ-టీమ్స్ చొరవతో బాల్య వివాహానికి బ్రేక్ పడింది.. బాలిక కుటుంబ సభ్యులకు, పెళ్లి కొడుకు తల్లిదండ్రులకూ షీ-టీమ్స్ ప్రతినిధులు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు.

వేధించేవారిపై ఫిర్యాదు చేయండి

ఇంటా బయటా వేధించే వారిపై ఫిర్యాదు చేయండి. షీ-టీమ్స్ వాట్సప్ నెం.87126 62111 ద్వారా ఫిర్యాదు చేయాలి. భువనగిరి ప్రాంతంలో బాధితురాళ్లు 87126 62598, చౌటుప్పల్ పరిధిలో 87126 62599, ఇబ్రహీంపట్నం పరిధిలో ఉండే వారు 87126 62600, కుషాయిగూడ పరిధి 87126 62601, ఎల్‌బీనగర్ పరిధి వారు 87126 62602, మల్కాజిగిరి వారు 87126 62603, వనస్థలిపురం ఏరియా వారు నెం.87126 62604 ద్వారా షీ-టీమ్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వేధింపులకు గురయ్యే మహిళలకు రాచకొండ షీ-టీమ్స్ అండగా ఉంటుంది..

- టి.ఉషావిశ్వనాథ్, డీసీపీ, రాచకొండ విమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్.

బీఆర్‌ఎస్ నేతల కబ్జాలపై ఉద్యమిస్తాం

- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

సరూర్‌నగర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు చేసిన కబ్జాలపై తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్టు కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ బూత్ కమిటీ కార్యకర్తల సమావేశం పార్టీ నాయకుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అల్మాస్‌గూడలోని ఏపీఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కేఎల్లార్ మాట్లాడుతూ చట్టాల్లోని లొసుగులను, ధరణిలోని ఆప్షన్లను అడ్డం పెట్టుకుని నాటి అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములను, చెరువుల ఎఫ్‌టీఎల్ స్థలాలను అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జాలను ప్రోత్సహించబోదని, గతంలోని కబ్జాలపై పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పోరాడుతామని ఆయన పేర్కొన్నారు. పార్టీలోని బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని ఆయన సూచించారు. సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల బరిలో పార్టీ తరపున ఎవరు పోటీ చేసినా కలిసికట్టుగా పనిచేసి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు.

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి తక్కువ, ఆడంబరం ఎక్కువ అన్నట్టుగా పరిస్థితి ఉండేదని ఆమె వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సంతోషీ శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మనోహర్, మహేశ్వరీ జైహింద్‌కుమార్, పార్టీ నాయకులు బోయపల్లి వెంకటరెడ్డి, నవారు మల్లారెడ్డి, భిక్షపతిరెడ్డి, రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, సతీష్‌గౌడ్, బాలకృష్ణ పాల్గొన్నారు.



జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం

అవిశ్వాసంలో రోజుకో మలుపు

- రెండుగా చీలిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు
- క్యాంపుల పేరుతో జల్సాలు.. కార్పొరేటర్లపై ఫైర్ అవుతున్న జనాలు
- కాసులకోసం జంప్ జిలానీ కార్పొరేటర్ల బేరాలు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్‌పై అవిశ్వాస బలపరీక్షకు సమయం దగ్గర పడుతుండడంతో వేగంగా రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. క్యాంపులోకి వెళ్లిన కార్పొరేటర్లు కాసుల కోసం బేరసారాలు ఆడుతున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు రెండుగా చీలడంతో రాజకీయం రంజుగా మారింది.

మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌పై ఈనెల 19న అవిశ్వాస బలపరీక్షకు ముహూర్తం ఫిక్స్ అయింది. అవిశ్వాస ప్రక్రియకు న్యాయస్థానం స్టే వస్తుందన్న ఆశలు సన్నగిల్లడంతో మేయర్ వర్గీయులు సందిగ్ధంలో పడ్డారు.

గోవాలో మేయర్ వర్గీయులు?

తనకు అనుకూలంగా ఉన్న కార్పొరేటర్‌లతో మేయర్ వర్గం గోవాలో క్యాంపునకు తరలారంటూ వార్తలు గుప్పుమంటున్నాయి. దానికి అనుగుణంగానే పబ్బుల్లో, బార్‌లలో జల్సాలు చేస్తున్న కార్పొరేటర్ల ఫొటోలు సామాజికమాధ్యమంలో కనిపించడంతో జవహర్‌నగర్ వాసులతోపాటు పలువురు రాజకీయ విశ్లేషకులు వారిపై దుమ్మెత్తిపోస్తున్నారు. మరోవైపు అవిశ్వాస పరీక్షకు తెరలేపిన 18మంది కార్పొరేటర్లు గతనెల 21న క్యాంపు పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో జల్సాలు చేస్తుండడంపై కూడా స్థానికులు మండిపడుతున్నారు. తెలుగుయువత జిల్లా నాయకుడు లక్ష్మణ్ మాట్లాడుతూ మేయర్, డిప్యూటీమేయర్ వర్గాలుగా విడిపోయి కార్పొరేటర్లు జవహర్‌నగర్‌వాసులు సమస్యలను గాలికి వదిలేశారని బాహాటంగానే విమర్శలు గుప్పించారు.

జంప్ జిలానీలతో తలలు పట్టుకుంటున్న ఇరువర్గాలు..

తమకు 18మంది ఉన్నారని ధీమాగా చెబుతున్న డిప్యూటీమేయర్ వర్గంలోనూ ఒక్కరు చేజారినా ఇన్ని రోజులు పడిన కష్టం వృధా అవుతుంది. అందుకే క్యాంపులో ఉన్న ప్రతి ఒక్కరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. మరోవైపు మేయర్ వర్గానికి చెందిన కార్పొరేటర్ గండి రాంచందర్‌ను కిడ్నాప్ చేశారంటూ ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకునేవరకు వెళ్లింది. కానీ, చివరి క్షణంలో సమ్మతి, అసమ్మతి వర్గాలకు దూరంగా ఉన్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఇదే సరైన అవకాశం అంటూ కార్పొరేటర్లు గోడ దూకేందుకు పెద్దమొత్తంలో ఆశిస్తున్నారు. ఒకవర్గం నుంచి మరో వర్గానికి రావాలంటే పెద్ద మొత్తంలో ఆశలు చూపిస్తుండటంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

గెలుపు తమదే అంటున్న ఇరువర్గాలు...

అవిశ్వాసం వీగిపోతుందని తమకు వచ్చిన భయమేమీ లేదని మేయర్ కావ్య ధీమాగా ఉన్నారు. మరోవైపు బలపరీక్షకు సరిపడా కార్పొరేటర్లు తమ వద్ద ఉన్నారని, కచ్చితంగా అవిశ్వాసం నెగ్గితీరుతామని డిప్యూటీ మేయర్ వర్గీయులు ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక్క కార్పొరేటర్ నీహారికగౌడ్ ప్రస్తుతానికి మౌనంగా ఉన్నారు. పరిస్థితులను బట్టి చక్రం తిప్పే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఏదిఏమైనా అవిశ్వాసం నెగ్గుతుందా, లేక వీగుతుందా అనేది తేలాలంటే 19వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సదస్సుకు హాజరైన కార్మిక సంఘాల నాయకులు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యమత్యంతో తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాజాల రుద్రకుమార్ పేర్కొన్నారు. ఈ నెల 16న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆటోనగర్‌లో మంగళవారం సదస్సును నిర్వహించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రుద్రకుమార్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ల అనుకూల విధానాలతో పాటు మతోన్మాద విధానాలతో ముందుకెళ్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మోటర్ వెహికిల్ చట్టం-2019లో రోడ్డు ప్రమాదాలకు కారకులైన డ్రైవర్లకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.7లక్షల జరిమానా డ్రైవర్లకు శరాఘాతంగా మారిందన్నారు. సదరు చట్టాన్ని సవరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైవర్లు, హమాలీలకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగా తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ జాయింట్ ప్లాట్ ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదికతో ఈనెల 16న సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు సీహెచ్.కృష్ణయ్య, ఆంజనేయులు, దయానంద్, వెంకటమ్మ, చంద్రరేఖ, దేవిసింగ్, సుభద్ర, శ్రీదేవి, సుగుణమ్మ, లలిత, మౌనిక, అరవింద్ పాల్గొన్నారు.

జడ్‌పీ రోడ్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

చంపాపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని జడ్‌పీ రోడ్‌లోని తెలంగాణ చౌరస్తా నుంచి అగ్రికల్చర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, భూపేష్‌గుప్తానగర్ కాలనీ వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, ర్యాంపులను మంగళవారం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, డీఆర్ఎఫ్ బృందం తొలగించింది. కార్పొరేటర్ సుజాతనాయక్ కూల్చివేతలను పర్యవేక్షించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో వాహనదారులు, బాటసారులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. రహదారి ఇరుకుగా మారడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు, రహదారి ఆక్రమించుకున్నవారు స్వయంగా తొలగించుకోవాలని కోరారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి జీహెచ్ఎంసీ సిబ్బంది చలాన్లు విధించినట్లు తెలిపారు. కార్పొరేటర్ వెంట నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్ ఉన్నారు.



హస్తినాపురం డివిజన్‌లోని జడ్‌పీ రోడ్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

ఓఆర్ఆర్‌పై కారును ఢీ కొన్న మరో కారు

- అక్కడికక్కడే ఒకరు..
- ఆస్పత్రిలో మరొకరి మృతి



ఓఆర్ఆర్‌పై ప్రమాదానికి గురైన కారు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో ఔటర్ రింగ్ రోడ్‌పై వెళుతున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కేసింది. అంతటితో ఆగక అదే వేగంతో దూసుకెళ్లి ఎదురు లేన్‌లో వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు కారులోనే చనిపోయారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని వనస్థలిపురం నివాసి రెడ్డప్ప రెడ్డి(50) సోమవారం రాత్రి ఓఆర్ఆర్ మీదుగా కారులో ఇంటికి వెళుతున్నారు. మేడ్చల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్ దాటి అతివేగంగా వచ్చి రెడ్డప్ప కారును ఢీకొంది. దీంతో రెడ్డప్ప కారులోనే చనిపోయాడు. ప్రమాదానికి కారణమైన కారు శామీర్‌పేట వైపు నుంచి మేడ్చల్ వైపు వస్తుండగా.. రెడ్డప్ప ప్రయాణిస్తున్న కారు దుండిగల్ వైపు నుంచి మేడ్చల్ వైపు వెళుతోంది. విషయం తెలుసుకున్న ఓఆర్ఆర్ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న రెడ్డి గణేశ్, మంగళపు గణేశ్, మోక్షిత్ రెడ్డిలను కారు నుంచి బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రెడ్డి గణేశ్(18) మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులను దుండిగల్ సమీపంలోని మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు.



రెడ్డప్ప



గణేశ్



బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాల్కసుమన్ దిష్టిబొమ్మల దహనం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైతన్యపురి, మీర్‌పేట్, చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్లలో దాము మహేందర్‌యాదవ్, సూర్యగంటి విజయ్, రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు చెకొలేకర్ శ్రీనివాస్, బొల్లు కిషన్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలు ప్రాంతాలలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలకుల పాపాలు ఒక్కటొక్కటిగా బయటపడుతుండడంతో ఆ పార్టీ నేతలకు భయం పట్టుకున్నదని, అందుకే అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ చెప్పు చూపుతూ సీఎంను దుర్భాషలాడిన నేపథ్యంలో ఆయనను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

- ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం